ప్రజాశక్తి

బుధవారం 9 అక్టోబర్ 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-పెద్దారవీడు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దారవీడు మండలంలోని సిద్ధినాయనపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. సిద్ధినాయనిపల్లి గ్రామానికి చెందిన రుద్రపాటి చిన్న చెన్నయ్య(70) రెండు ఎకరాలలో మిరప, ఎకరన్నరలో టమోటా, రెండున్నర ఎకరాల్లో పొగాకు సాగు చేశారు. సాగు కోసం మూడు బోర్లు వేయించారు. ఈయనకు మొత్తం రూ.9 లక్షల మేరకు అప్పు ఉంది. పెద్దారవీడు ఎస్‌బిఐలో రూ.1.30 లక్షలు, దేవరాజుగట్టులోని కెనరా బ్యాంకులో రూ.లక్ష, మిగతాది స్థానికుల వద్ద అప్పు చేశారు. పంట నష్టం రావడంతో పాటు అప్పులు ఎక్కువ కావడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. ఈయనకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు పెద్దారవీడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములవ్వాలి..

- స్వర్ణాంధ్ర 2047 అభివృద్ధికి సమగ్ర కసరత్తు
- యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల అమలు
- వర్క్ షాప్‌లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

మాట్లాడుతున్న మంత్రి స్వామి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్వర్ణాంధ్ర-2047 ఎపి విజన్ అజెండాతో రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రతిఒక్కరూ తప్పనిసరిగా భాగస్వాములు కావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమం, సచివాలయాలు, వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ రూపకల్పనలో భాగంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఒంగోలు కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశ మందిరంలో జిల్లా మంత్రి, శాసనసభ్యులతో వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధ్యక్షత వహించారు. ఈ సంధర్భంగా వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, మత్స్య శాఖ, పరిశ్రమలు, జలవనరులు, ఆర్.డబ్ల్యూ. ఎస్., పర్యాటక శాఖలు రూపొందించిన విజన్ డాక్యుమెంట్‌ను సంబంధిత శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 విజన్‌ను అభివద్ధి చేసేందుకు సమగ్ర కసరత్తు చేపట్టిందన్నారు. 2047 నాటికి స్వాతంత్ర్యం వచ్చి 100 సంవత్సరాలు పూర్తి అయ్యే నాటికి దేశం పూర్తిగా అభివద్ధి చెందాలనే లక్ష్యంతో వికసిత్ భారత్ పేరుతో అన్ని రంగాలను అభివద్ధి చేస్తూ 2047 కార్యాచరణ ప్రణాళిక రూపొందించారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్ర 2047 ద్వారా రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించడం, నిరుద్యోగ సమస్య పూర్తిగా రూపుమాపాలని, ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలి, తలసరి ఆదాయం పెరగాలన్న లక్ష్యంతో ముందుకు పోతున్నారన్నారు. ప్రాథమిక రంగాన్ని మరింతగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో సిఎం ఉన్నారన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలను మరింతగా ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటున్నారు. అనంతపురం జిల్లా కరువు ప్రాంతంగా వుండేదని, 2014-19 సంవత్సరాల కాలంలో ఆనాటి ప్రభుత్వం తీసుకున్న చర్యలు, ఉద్యాన పంటల ప్రోత్సాహంతో నేడు అనంతపురం జిల్లా మంచి ఆదాయంతో సస్యశ్యామలంగా ఉందన్నారు. ఎన్నికల హామీల్లో చెప్పిన విధంగా 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంతో ముందుకు పోతున్నామని, యువతకు నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను అమలుచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. స్కిల్ సెన్సెస్ చేపడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పారిశ్రామిక రంగంపై ప్రత్యేక దష్టి సారిస్తున్నామని, ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఫార్మా రంగాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు, గ్రానైట్ రంగానికి మరింతగా ప్రోత్సాహం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్‌ను వీలైనంత త్వరగా పూర్తిచేసేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. జిల్లాలో వీలైనంత వరకు చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలను చేపట్టి సమర్థవంతంగా నీటి సంరక్షణ ▶ 2లో

మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

'వెలిగొండ'ను విస్మరిస్తే ఉద్యమిస్తాం..

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

▶ మెయిన్ 5లో

ముందే మద్యం సిండికేట్.!

- దరఖాస్తు వేయాలంటేనే దడదడ..
- 171 దుకాణాలకు 1250 దరఖాస్తులు
- 26 దుకాణాలకు సింగిల్ అప్లికేషన్

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

మద్యం వేలం జరగకుండానే వ్యాపారులు సిండికేట్‌గా మారారు. దుకాణాలను దక్కించుకునేందుకు పాలకపక్షం అండదండలున్న వ్యాపారులే దరఖాస్తు చేసుకునే పరిస్థితి వచ్చింది. ప్రతిపక్షాల నుంచి ఎవరైనా వేస్తే దుకాణం ఎలా నడుపుతారో చూస్తామనే బెదిరింపులు నడుస్తున్నాయి. దీంతో దరఖాస్తు వేయాలంటేనే కొందరు భయపడిపోతున్నారు. ఒక వేళ వేలంలో మద్యం షాపు దక్కించుకున్నా నిర్వహణ కష్టమనే భయంలోకి వెళ్లిపోతున్నారు. ఏకపక్షంగానే దరఖాస్తులు వస్తున్నాయా? అనే సందేహాలూ లేకపోలేదు. మంగళవారం నాటికి 171 దుకాణాలకు గానూ 1250 దరఖాస్తులు అందాయి. ఇందులో 26 దుకాణాలకు సింగిల్ అప్లికేషన్ వచ్చింది. ఎవరూ వేయకుండా బెదిరింపులు జరిగాయని సుస్పష్టం అవుతోంది. ఈ సింగిల్ అప్లికేషన్ వచ్చిన దుకాణాల పరిధిలో వ్యాపారులు అందరూ పాలకపక్ష నేతల అండదండలతోనే సిండికేట్‌గా మారినట్లు తెలుస్తోంది. మిగతా దుకాణాల పరిధిలోనే ఇదే జరగనుంది. ఇప్పటినుంచే చర్చలు సాగుతున్నాయి. ఎవరికి వచ్చినా అందరూ ఒకట్టై సిండికేట్‌గా మారాల్సి ఉంది. పైగా భారీ ఫీజులు కడుతున్నారు. వేలం నిజంగా జరిగితే ఎంతకు వెళుతుందో కూడా చెప్పలేం. పెట్టిన డబ్బులును రాబట్టుకునేందుకు అడ్డగోలుగా అమ్మకాలు చేయాల్సి ఉంది. అందుకు సిండికేట్ తప్పనిసరంటున్నారు. ఇక పాలకపక్షం పెద్దలు పెద్ద ఎత్తున జోక్యం చేసుకుంటున్నారు. ఎమ్మెల్యేలే ఈ వ్యవహారాన్ని పర్యవేక్షిస్తున్నారు. తమకు తెలియకుండా ఎవరైనా దరఖాస్తు పెట్టుకుంటే ఇబ్బంది పడతారనే సంకేతాలు ఇస్తున్నారు. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలకు తెలియకుండా దరఖాస్తు వేయడం గగనంగానే కనిపిస్తోంది. 171 దుకాణాల్లో 26 దుకాణాలకు సింగిల్ అప్లికేషన్ అంటేనే వేలం తీరు ఎలాఉందో చెప్పాల్సిన అవసరం లేదు. దరఖాస్తుల స్వీకరణకు మరో రెండు రోజుల గడువు ఉంది. 11వ తేదీన వేలం వేయాలని ముందు నిర్ణయించారు. మరుసటి రోజునే దుకాణాలు కేటాయిస్తారు. వేలం ప్రక్రియతో మరింత ▶ 2లో

ఉత్తర క్రియలు

సౌమ్యశీలి, సహన శీలి, స్నేహ శీలి
ఎంతో మంది జీవితాలలో వెలుగులు
నింపిన దానశీలి
మాగుంట ఇంటి దీపం,
మా పెద్ద దిక్కు
స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి గారి
సతీమణి
శ్రీమతి మాగుంట పార్వతమ్మ గారు
మాజీ పార్లమెంటు సభ్యురాలు,
మాజీ శాసనసభ్యురాలు
సెప్టెంబర్ 25న స్వర్గస్తురాలైనారు.
వారి దివ్య ఆత్మ శాంతికై ప్రార్థిస్తూ....

మాగుంట పార్వతమ్మ గారు
జననం : 27-07-1947 నిర్యాణం : 25-09-2024

సుమాలిని-శివకుమార్‌రెడ్డి
మమతా రెడ్డి
అనన్య- అనిష్
దీప్తి - గౌతమ్‌రెడ్డి
స్వాతి - కిరణ్ రెడ్డి
గీతాలత- శ్రీనివాసులు రెడ్డి
స్నేహలతా రెడ్డి
సుహాసిని- మధుసూదన్ రెడ్డి
చందన - రాఘవ్ రెడ్డి
నిఖిల్

మాగుంట సుబ్బరామ్‌రెడ్డి
మరియు కుటుంబ సభ్యులు

పెద్దకర్మ : తేది : 09-10-2024 బుధవారం ఉదయం 11.30 గంటలకు
నెల్లూరు సరస్వతీ నగర్‌లోని 'మాగుంట నివాసం' నందు జరుగును

జనరల్ నాలెడ్జ్ పెంపొందేలా బోధన

ఉపాధ్యాయులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు జనరల్ నాలెడ్జి పెంపొందేలా బోధన ఉండాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. మంగళవారం ఒంగోలు కేంద్రీయ విద్యాలయంలో జరిగిన మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రీయ విద్యాలయం పరిస్థితి, 2024-25 సెషన్ కోసం అడ్మిషన్ మార్గదర్శకాలు, తరగతుల వారీగా విద్యార్థుల నమోదు, సిబ్బంది మంజూరు, ఖాళీ పోస్టులు వివరాలు, గత కమిటీ సమావేశం ఎజెండా వివరాలు, తీసుకున్న చర్యలు, ప్రస్తుత కమిటీ సమావేశం ఎజెండా వివరాలు వంటి అంశాలను కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం. మనీష్ కుమార్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ఉత్తమ పౌరులుగా జీవించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలసిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. క్రమం తప్పకుండా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు విద్యార్థుల్లో గ్రూప్ యాక్టివిటీస్ ను పెంపొందించాలన్నారు. పిల్లల్లో వున్న సజనాత్మకతను గుర్తించి అందుకనుగుణంగా బోధన ఉండాలని కలెక్టర్ సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

పాఠశాల పక్కనే అందుబాటులో ఉన్న ప్లే గ్రౌండ్ కోసం భూమి కేటాయింపు విషయమై పరిశీలించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు సమావేశంలో కేంద్రీయ విద్యాలయం కమిటీ సభ్యులు స్టెప్ సి ఈఓ లోకేశ్వర రావు, డిఎం,హెచ్ఓ డాక్టర్ డి సురేష్ కుమార్, ఒంగోలు రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ పి. ప్రకాష్ బాబు, జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ సీతాలక్ష్మి, ఒంగోలు కేంద్రీయ విద్యాలయం రిటైర్డ్ ప్రిన్సిపల్ సూర్యప్రకాష్ రావు, ఒంగోలు మునిసిపల్ కార్పోరేషన్ ఇంజనీర్ పద్మజ పాల్గొన్నారు.

పనుల ప్రారంభానికి చర్యలు: కలెక్టర్

ప్రజాశక్తి -ఒంగోలు కలెక్టరేట్

గ్రామ సభలలో గుర్తించిన పనులన్నింటినీ వచ్చేవారం 'పల్లె పండుగ' కార్యక్రమంలో పూర్తిస్థాయిలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ మంగళవారం అమరావతి సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో చేపట్టే పనుల వివరాలను ఈ సందర్భంగా డిప్యూటీ సిఎంకు కలెక్టర్ వివరించారు. 972 పనులకు పరిపాలన అనుమతులు ఇచ్చామని, 928 పనులకు సాంకేతిక అనుమతులు లభించాయన్నారు. పెండింగ్‌లోని ప్రతిపాదనలకు కూడా సాంకేతిక అనుమతులు లభిస్తే వాటినీ చేపడుతామని తెలిపారు. నిర్మాణ పనులు చేపట్టడానికి ఇసుక పరంగా సమస్యలు లేవని, సిమెంటు సరఫరా సకాలంలో జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

పర్యవేక్షిస్తే జనవరి నాటికి ఈ పనులన్ని పూర్తయ్యేలా చూస్తామని కలెక్టర్ తెలిపారు. పనులన్ని చేపట్టడానికి సంబంధిత స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ఇప్పటికే ప్రణాళిక రూపొందించామని ఆమె వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ జోసఫ్ కుమార్, డిపిఓ ఉషారాణి, జెడ్పి సిఈఓ బి.చిరంజీవి, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్ లక్ష్మి ఆశీర్వాదం

దర్శి: టిడిపి దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దర్శి మండలం క్రిష్ణాపురం గ్రామానికి చెందిన నిడమానూరి వారి పంచెల బహూకరణ వేడుకలో పాల్గొని భానుచందర్‌ను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి మండలం మరియు కృష్ణాపురం గ్రామంలోని వివిధ హెూదాల్లో ఉన్న టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు చేపట్టేలా ప్రణాళికలు చేపడుతున్నట్లు మంత్రి వివరించారు. మార్కాపురం వైద్యకళాశాలలో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దొనకొండ పారిశ్రామిక వాడ అభివద్ధి, జిల్లాలో భూ సమస్యలపై దష్టి సారించామన్నారు. అందులో భాగంగా త్వరలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి.. భూ సమస్యల పరిష్కారానికి కషి చేస్తున్నామన్నారు. ప్రకాశం జిల్లాను 2047 నాటికి స్వర్ణ ప్రకాశంగా ముందుకు తీసుకెళ్ళేందుకు వ్యవసాయ, విద్య, వైద్య, పారిశ్రామిక రంగాలతో పాటు పర్యాటక రంగాన్ని అభివద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని, ప్రతి ఒక్కరూ ఈ బహత్తర కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఒక్కరూ స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని మంత్రి పిలుపు నిచ్చారు.

విజన్ డాక్యుమెంట్‌పై శిక్షణ

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రకాశం జిల్లాకు సంబంధించి విజన్ డాక్యుమెంట్‌ను తయారు చేయడానికి శాఖల వారీగా రెండు నెలల నుండి శిక్షణ ఇచ్చినట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. జిల్లా అభివద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అన్ని రంగాల ప్రజలను భాగస్వాములు చేసి వారి సలహాలు, సూచనలు తీసుకున్నామన్నారు. 2047 విజన్ సాకారానికి కొన్ని రంగాలను గుర్తించామని, వ్యవసాయం, అనుబంధ రంగాలు, విద్య మరియు నైపుణ్యం, ఆరోగ్యం మరియు సామాజిక సంక్షేమం, మౌలిక సదుపాయాలు కనెక్టివిటీ, సుస్థిరత, వాతావరణ సమతుల్యత, ఆర్థికాభివద్ధి, అత్యాధునిక తయారీ రంగం, లాజిస్టిక్స్, నాలెడ్జ్ ఎకానమీపై ప్రత్యేక దష్టి సారించామన్నారు. ఆ శాఖల ద్వారా 15 శాతం వద్ధి రేటుతో రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండల స్థాయిలో రాబోయే 5 సంవత్సరాల కార్యాచరణ ప్రణాళికలు రూపొందించామన్నారు. వర్క్‌షాప్‌లో ఒంగోలు, కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధనరావు, డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, ఒంగోలు ఆర్డీవో కె. లక్ష్మి ప్రసన్న, సిపిఒ డి.వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముందే మద్యం సిండికేట్.!

(మొదటిపేజీ తరువాయి)

ఆదాయం పొందవచ్చనే ఆలోచన చేశారు. అయితే ఇప్పుడు లాటరీ పద్ధతిలో దుకాణాలు అప్పగించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఈ విధానంలో ఎవరికి దక్కుతుందనేదీ చెప్పలేము. ఎవరికైనా రావచ్చు. అయితే ఎవరికి వచ్చినా పాలకపక్షనేతల సహకారం లేకుండా దుకాణం నడపడం కష్టమనే చర్చ బాహాటంగానే సాగుతోంది. మరో రెండు రోజులు గడువు ఉన్నందున దరఖాస్తులు పెరగనున్నాయి. దుకాణాల కోసం మండలాల్లో పాలకపక్ష నేతలు తర్జనభర్జన పడుతున్నారు.

ఈ క్రాప్ వివరాల పరిశీలన

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

సిఎస్ పురం రెవెన్యూ పరిధిలో ఈ క్రాప్ నమోదు వివరాలను తహశీల్దార్ డీ మంజునాథరెడ్డి మంగళ వారం పరిశీలించారు. ఈ క్రాప్ నమోదులో తప్పులు లేకుండా చూసేందుకు వ్యవసాయ శాఖ సిబ్బంది నమోదు చేసిన ఈ క్రాప్ వివరాలను మంగళవారం తహశీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నా, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం సంభవిస్తే ప్రభుత్వం నుంచి నష్టపరిహారం పొందాలన్నా ఈ క్రాప్ నమోదు తప్పనిసరి అని అన్నారు. పంటలు సాగు చేస్తున్న రైతులు ప్రతి ఒక్కరూ ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎఎ శారద, రైతులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న తహశీల్దార్ మంజునాథ రెడ్డి

పొలంలో రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారి

సజ్జలు రూ.2,600కు అమ్ముకోవాలి: ఎఒ

ప్రజాశక్తి-పొదిలి

రైతులు సజ్జ పంటను క్వింటా రూ.2,600కు అమ్ముకోవాలని పొదిలి వ్యవసాయ అధికారి ఎస్‌కె జైనులాబ్దీన్ సూచించారు. మంగళవారం మండలంలోని మాదాలవారిపాలెం, నందిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి షేక్ జైనులాబ్దీన్ రైతులకు వ్యవసాయ, అనుబంధ శాఖలలో అమలవుతున్న పథకాల గురించి వివరించారు. తదుపరి క్షేత్రస్థాయిలో కంది, సజ్జ పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు ఇచ్చారు. సజ్జ పంట కోత దశలో ఉన్నందున అకాల వర్షాలకు కంకులు తడవకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలానే రైతులు క్వింటా సజ్జలు రూ.2,600/- కన్నా తక్కువకు అమ్మ వద్దని, మార్కెట్ ధర తక్కువ ఉన్నట్లయితే ప్రభుత్వం వారు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారని తెలిపారు. కంది పంట శాఖీయ దశలో ఉన్నందున ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఏపుగా పెరిగింది. కంది పంటలో వెర్రి తెగులు నివారణకు, నల్లి నివారణ చర్యలు చేపట్టాలని తెలియజేశారు.

మహారాజశ్రీ దరిశి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. No. 5/2022

O.S No. 35/2005 of SC JC, మార్కాపురం

నటుకుల నాగేశ్వరరావు ... డి.హెచ్.ఆర్

Vs

తాడికాశిరెడ్డి (లేటు) మరియు వగైరాలు ... జె.డి.ఆర్

To:

R5 తాడి బ్రహ్మారెడ్డి, S/o. కాశిరెడ్డి (లేటు) R/o. గార్లెదిన్నె పోస్ట్, కొనకనమిట్ల మండలం, ప్రకాశం జిలా.

మీకు పై కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. అందువలన మీకు నోటీసు జారీ నిమిత్తము శ్రీ కోర్టువారు తేది. 07-11-2024 న ఉదయం గం॥10-30 ని॥లకు పై కోర్టులో స్వయంగా గాని లేక ఏజెంటు ద్వారా గాని హాజరై ఎట్టి ఆక్షేపణలు ఉన్న ఎడల తెలుపుకొనవలసినది లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 07-11-2024

ఇట్లు

స్థలం: దరిశి

తేది: 08-10-2024

శ్రీ జి.టి. శివశర్మ, అడ్వకేట్, దరిశి, ప్రకాశం జిల్లా.

ఒంగోలు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EP No: 114/2022

In

OS No: 282/2018

మలినేని మల్లికార్జునరావు అలియాస్ మల్లికార్జున .... వాది/D.H.R

వర్సెస్

కందిమళ్ళ రామాంజనేయులు ...ప్రతివాది/J.D.R

To

డిపెండెంట్ /జెడిఆర్

కందిమళ్ళ రామాంజనేయులు

S/o నారాయణస్వామి, అలియాస్ నారాయణ,

R/O 1st లైన్, సుజాతనగర్,తాలూకా

పోలీస్ స్టేషన్‌పక్కన, ఒంగోలు టౌన్, ప్రకాశం జిల్లా.

పై నెంబరు EP No : 114/2022 In OS No : 282/2018 కేసులో ప్రతి వాది/JDR అయిన నీకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా పై నెంబరు EP No: 114/2022 In OS No : 282/2018 పిటిషన్‌లో నీ హాజరు నిమిత్తం తేది 12-11-2024 నకు వాయిదా కలదు కనుక ఆరోజు ఉదయం 10:30కి పై కోర్టు వారి ఎదుట నీవు స్వయంగా గాని లేదా నీలాయర్ ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై పై నెంబర్ EPలో మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను లేని యెడల పై నెంబరు EP NO 114 /2022 In OSNo.282/2018 కేసును నీ పరోక్షమున తీర్మానించేదరు

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు

పెండ్యాల శివహరి

షేక్ హిదయతుల్లా

అడ్వకేట్స్, ఒంగోలు

ప్రకాశం జిల్లా.

ఒంగోలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జివారి కోర్టులో.

EP No : 17/2023

In

OS No : 53/2014.

జిల్లెళ్ళమూడి శ్రీనివాసులు వగైరాలు... డిక్రీహెూల్డర్స్

మరియు

లక్కవరపు లక్ష్మీ నారాయణ వగైరాలు ..జడ్జిమెంట్ డేటార్స్

ప్రకటన

To

1st JDR లక్కవరపు లక్ష్మీ నారాయణ

S/o కోటిలింగం R/o బాలాజీ ఎవెన్యూ

అపార్ట్ మెంట్స్, ఫ్లోర్ నెంబర్ G1, 3వ లైను,

నిర్మల్ నగర్ ఒంగోలు పట్టణం .

3వ JDR లక్కవరపు రవిశంకర్

S/o లక్ష్మీనారాయణ R/o బాలాజీ ఎవెన్యూ

అపార్ట్ మెంట్స్,ఫ్లోర్ నెంబర్ G1, 3వలైను,

నిర్మల్‌నగర్, ఒంగోలు పట్టణం .

4వ JDR లక్కవరపు స్వాతి W/o వీరభద్రం

R/o D.No: 16-31-6,7th phase,

కే.పి.హెచ్.బి కాలనీ, హైదరాబాద్.

పై నెంబర్ EPలో మీకు ఎన్ని సర్యాయములు నోటీసులు పంపిననూ ముట్టనందున మీ నోటిసు నిమిత్తము వాయిదా తేది 21-10-2024 న అయిఉన్నది. తేది: 21-10-2024న ఉదయం గం.10.30ని.లకు పైకోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ లేక లాయరు గారి ద్వారా గానీ హాజరుపడి, మీఆక్షేపణలు తెలియచేయ వలెను లేని యెడల మీపరోక్షమున కేసుతీర్మానము చేయ బడునని తెలియచేయడమైనది

// శ్రీ కోర్టువారి అనుమతితో //

వాయిదా తేది : 21-10-2024.

ఇట్లు

యం.గంగాధరరావు

కె.శివప్రసాదరావు

న్యాయవాదులు, ఒంగోలు

ప్రజాశక్తి 3
బుధవారం 9 అక్టోబర్ 2024

ఎడ్జ్ కటింగ్ యూనిట్లు మూత

- ముడి మెటీరియల్ సరఫరా నిలిపివేత
- స్వగ్రామాలకు వెళ్లిన కార్మికులు
- రోడ్డునపడ్డ యజమానులు

ప్రజాశక్తి-చీమకుర్తి

టు బై వన్, టు బై టు సైజు పాలిషింగ్ శ్లాబులు అందించే ఎడ్జ్ కటింగ్ యూనిట్లు మూతపడ్డాయి. గత రెండు నెలలుగా ముడి వ్యర్థ శ్లాబులు లభించక యూనిట్లు మూతపడ్డాయి. దీంతో గ్రానైట్ పాలింగ్ యూనిట్ల నుంచి లభించే వ్యర్థ శ్లాబులను సేకరించుకుని ఎడ్జ్ కటింగ్ చేసి జీవనం సాగిస్తున్న నిరుద్యోగ యువత ఆందోళన చెందుతున్నారు. ఎడ్జ్ కటింగ్ పరిశ్రమపై ఆధారపడి ఇతర రాష్ట్రాల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి పొట్టపోసుకుంటున్న వందలాది మంది కార్మికులు పనులు లేకపోవడంతో తమ స్వగ్రామాలకు తరలిపోతున్నారు.

చీమకుర్తి,ఆర్‌ఎల్‌పురం,బూదవాడ, ఏలూరురోడ్డు ప్రాంతాలలో నిరుద్యోగ యువత చిన్నపాటి పెట్టుబడితో కొద్దిపాటి స్థలంలో చిన్న షెడ్డు వేసుకొని 200 ఎడ్జ్ కటింగ్ యూనిట్లు ఏర్పాటు చేశారు. పెద్ద పాలింగ్ యూనిట్ల వద్ద లభించే వ్యర్థ శ్లాబులను ట్రాక్టర్లతో సేకరించుకొని టు బై వన్, టు బై టు, పట్టీలు తదితర సైజులలో శ్లాబులను కట్ చేసి ఇతర రాష్ట్రాలకు,ఇతర దేశాలకు ఎగుమతి చేస్తారు. అన్ని ఖర్చులు పోనూ ఒక్కో యూనిట్ యజమానికి కనీసం రూ.30 వేల నుంచి రూ.50 వేల మిగుతుంది. అయితే గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లు పరిశ్రమ ముడిరాయి కొరత,విద్యుత్ ఛార్జీల పెంపు ,అంతర్జాతీయ మార్కెట్ కుదింపు, మార్కెట్ లేకపోవడంతో సంక్షోభం దిశగా నడుస్తుంది. ఇటీవల యూనిట్ యజమానులు తమ సంఘాలను పరిపుష్టి చేసుకొని, సంక్షోభం నివారణకు పలు చర్యలు ప్రారంభించాయి. అందులో భాగంగా ఉత్పత్తి తగ్గించడానికి ప్రతి ఆదివారం సెలవు పాటించడం, ముడి వ్యర్థ శ్లాబులను ఎడ్జ్ కటింగ్ యూనిట్లకు ఇవ్వరాదని నిర్ణయించారు. ఫలితంగా ముడి వ్యర్థ శ్లాబులు ఎడ్జ్ కటింగ్ యూనిట్లకు సరఫరా నిలిచి పోయింది. దీంతో ఎడ్జ్ కటింగ్ పరిశ్రమ కుదేలైంది.

మూతపడిన ఎడ్జ్ కటింగ్ యూనిట్

ఎడ్జ్ కటింగ్ పరిశ్రమకు ముడి వ్యర్థ శ్లాబులు ఇవ్వాలి

పాలిషింగ్ యూనిట్లను నమ్ముకొని బతుకుతున్నామని, తమ ఎడ్జ్ కటింగ్ యూనిట్లకు కూడా ముడి వ్యర్థ శ్లాబులను ఇచ్చి ఆదుకోమని ఎడ్జ్ కటింగ్ యజమానులు కోరుతున్నారు. కుటీరపరిశ్రమ లాంటి తమ పరిశ్రమను నమ్ముకొని వందలాది మంది కార్మికులు, నిరుద్యోగులు జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ముడి వ్యర్థ శ్లాబులు ఇచ్చి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

వార్డు మెంబర్లకు శిక్షణ

ప్రజాశక్తి -రాచర్ల

స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ సూరే వెంకటరామిరెడ్డి అధ్యక్షతన రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ శిక్షణకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ఉప సర్పంచులు, ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఒక మహిళ వార్డు సభ్యురాలు, ఒక పురుష వార్డు సభ్యుడు హాజరయ్యారు. ఆర్థిక వనరుల నిర్వహణ ,పారిశుధ్య నిర్వహణ, తాగు నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి వెంకటేష్, టిఎటిలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్ : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ చెన్నారావు అధ్యక్షతన ఉపసర్పంచులు, ప్రతి పంచాయతీ నుంచి ఓ మహిళా వార్డు సభ్యురాలు, ఓ పురుష వార్డు సభ్యుడికి రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 1994 పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పించారు. పంచాయతీల్లో ఆదాయం వనరుల ఏర్పాటు,పారిశుధ్య, చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచులు, వార్డుసభ్యులు , కార్యాలయ ఎఒ విజయ, పంచాయతీ కార్యదర్శులు రాఘవరావు, వెంకటేశ్వర్లు, టిఒటిలు పాల్గొన్నారు.

కొండపి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వార్డు మెంబర్లు , ఉపసర్పంచులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రామాంజనేయులు మాట్లాడుతూ పంచాయతీ ఆదాయం, పారిశుధ్య మెరుగుదల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇఒ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అండాశయ తిత్తి తొలగింపు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

తొలగించిన అండాశయ తిత్తి

యర్రగొండ పాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాల వైద్య బృందం వైద్య నైపుణ్యాన్ని ప్రదర్శించి ఓ మహిళ కడుపులో ఉన్న భారీ అండాశయ తిత్తిని మరియు పెద్ద ఫైబ్రాయిడ్ గర్భాశయాన్ని తొలగించి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఏరియా వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టర్ దేవర యదిద్యా మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియా వైద్యశాలలో సీనియర్ వైద్యులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ఈ అపరేషన్‌లో తనతో పాటు సివిల్ సర్జన్‌లు డాక్టర్ రాంజీ నాయక్, డాక్టర్ వెంకయ్య, జ్యోతిలక్ష్మి, అంజలి, అజయ్ పాల్గొన్నారని తెలిపారు.

హామీల అమలు దిశగా కూటమి ప్రభుత్వం

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు తెలిపారు. ఒంగోలు నగరంలోని కెబి హోటల్‌లో ఎన్‌డిఎం కూటమి పక్ష సమన్వయ కమిటీ సమావేశం మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇది ప్రజలు కోరుకున్న మంచి ప్రభుత్వమన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇచ్చిన హామీలన్ని నెరవేర్చి వారి సంక్షేమాభివద్ధికి కషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 100 రోజులు పూర్తయిన సందర్భంగా నాయకుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు కూడా కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు వివరించడంతో పాటు ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కలసి పనిచేద్దామన్నారు. ఈ సమావేశంలో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, పార్టీ నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్త కంది రవి శంకర్, టిడిపి నాయకులు మంత్రి శ్రీనివాసరావు, వైవి సుబ్బారావు, కొఠారి నాగేశ్వరావు, బిజెపి జిల్లా అధ్యక్షుడు పివి.శివారెడ్డి, యానం చిన్న యోగయ్య యాదవ్, ఎన్‌డిఎ కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్ధన్

హెడ్ కానిస్టేబుల్ జయరావుకు నివాళి

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జి. జయరావు సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో ఆయన్ని ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ విషయ గురించి తెలుసుకున్న ఒంగోలు అదనపు ఎస్‌సి అశోక్ కుమార్, ఒంగోలు డిఎస్‌పి రాయపాటి శ్రీనివాసరావు, శింగరాయకొండ సిఐ హజరత్తయ్య, తాలూకా సిఐ అజయ్ కుమార్, టంగుటూరు ఎస్ఐ నాగమల్లేశ్వరరావు తదితరులు జయరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

జయరావు కుటుంబానికి పరామర్శ

కొండపి : మండల పరిధిలోని పెరిదేపి గ్రామానికి చెందిన గంటేనపల్లి జయరావు సోమవారం సాయంత్రం కొండపి నుంచి బైకుపై ఒంగోలు వెళు _న్నాడు. వెంగముక్కలపాలెం సమీపంలోని భగీరథ కెమికల్స్ ఫ్యాక్టరీ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి గుంతలో పడిపోయాడు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయన్ని ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న కొండపి ఎస్ఐ ప్రేమ్ కుమార్ జయరావు మతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళు లర్పించారు. నివాళుర్పించిన వారిలో పోలీసు సిబ్బంది అంకరావు, కోటేశ్వరరావు వెంకటేశ్వర్లు, అంజి ఉన్నారు. మృతుడు జయరావు టంగుటూరు పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

నివాళులర్పిస్తున్న ఒంగోలు డిఎస్‌పి శ్రీనివాసరావు

పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

అలుగును వేటాడిన కేసులో ముగ్గురు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

అలుగును వేటాడిన కేసులోని ముగ్గురు నిందితులను ఫారెస్టు అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. అందిన వివరాల ప్రకారం... పెద్దదోర్నాల మండలం చిలకచర్ల బోడుగూడేనికి చెందిన దాసరి బుడ్డన్న, పెద్దారవీడు మండలం ప్రగళ్లపాడు గ్రామానికి చెందిన కుడుముల బయన్న ఓ అలుగును వేటారు. దాని విక్రయించేందుకు దోర్నాల సుందరయ్య కాలనీకి చెందిన మంద బాబూరావు, జమ్మి దోర్నాల గ్రామానికి చెందిన చాట్ల దానమయ్య, కొత్తూరు గ్రామానికి చెందిన పెద్దన్న వారికి సహకారించారు. ఈ విషయం సమాచారం అండటంతో ఫారెస్టు అధికారులు దాడి చేసి నిందితులు మంద బాబూరావు, పెద్దన్న, దానమయ్యను అదుపులోకి తీసుకున్నారు. దాసరి బుడ్డన్న, కుడుముల బయన్న పరారీ అయినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌ఒ ఎస్‌కె.మునీర్, డిఆర్‌ఒ నయాబ్ రసూల్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన పొగాకు కొనుగోళ్ళు

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రంలో సోమవారంతో పొగాకు కొనుగోళ్లుముగిసినట్లు వేలం నిర్వహణాదికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. పొగాకు రైతులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధి మాట్లాడుతూ బుధవారం నుంచి సూర , ముక్కు కొనుగోళ్ల ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతగరం రైతులు నాయకులు రైతులు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్, బోర్డు సిబ్బందిని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బోర్డు మెంబర్ బొడ్డపాటి బ్రహ్మయ్య, రైతులు పాల్గొన్నారు.

కిలో పొగాకు అత్యధిక ధర రూ.358

కొండపి పొగాకు వేలం కేంద్రానికి బుధవారం 2028 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 1,899 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 129 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.358, అత్యల్ప ధర రూ.49, సరాసరి ధర రూ.198.38 పైసలు పలికింది.

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి- కొత్తపట్నం

న్యాయవ్యవస్థలో పురుషులతో పాటు మహిళలు కూడా సమానమని, వారికి సమాన అవకాశాలు ఉన్నాయని, వాటిని గుర్తించి న్యాయపరమైన హక్కులు పొందాలని సీనియర్ న్యాయవాది కాట్రగడ్డ అరుణ తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మరియు జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో 'విధాన్ సే సమాధాన్' కార్యక్రమంలో భాగంగా స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళలకు మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది ఎన్.ధనలక్ష్మి మాట్లాడుతూ పని ప్రదేశాలలో మహిళలపై జరుడుదున్న లైంగిక దోపిడీ, వాటి నివారణ కోసం యాజ మాన్యాలు ఏర్పాటు చేయాల్సిన సంఘాల గురించి, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మహిళలకు అందించే ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ ఫణి రాజ కుమారి, ఎపిఎం విజయ కుమారి, సిసిలు రామారావు, సుధాకర్, రఘూన్సీ, ఎస్‌హెచ్ గ్రూపు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు జ్ఞాపికను అందిస్తున్న అర్చకులు

కనకదుర్గమ్మ సన్నిధిలో రెవెన్యూ మంత్రి అనగాని

ప్రజాశక్తి - రేపల్లె

కనకదుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకొని విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనాలు మధ్య అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో కనకదుర్గమ్మ అమ్మవారికి శేష వస్త్రాలు అందజేసి ప్రత్యేక పూజలు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారిని ఆరవ రోజు శ్రీ మహాలక్ష్మి దేవి రూపంలో అలంకరించారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తున్న భక్తులకు ఏర్పాటు చేసిన క్యూలైన్‌లలో అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు

ప్రజాశక్తి - రేపల్లె

డీఎస్పీ శ్రీనివాసరావు

డీఎస్పీగా ఎ. శ్రీనివాసరావు మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సాధారణ బదిలీలలో భాగంగా రేపల్లెకు డీఎస్పీగా వచ్చినట్లు చెప్పారు. ఇక్కడ స్థానిక పరిస్థితులను అవగాహన చేసుకుని సిబ్బంది సూచనలు ఉన్నతాధికారుల సలహాల మేరకు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానని చెప్పారు. విధి నిర్వహణలో ప్రజలతో మమేకమై స్నేహపూర్వక పోలీస్ విధానాన్ని పటిష్టంగా అమలు చేస్తానని తెలిపారు. సమాజంలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, ప్రజలకు సంబంధించిన హక్కుల విషయంలో పారదర్శకంగా వ్యవహరించి న్యాయం చేస్తామన్నారు. నేరాలు వాటి నియంత్రణ.. లా అండ్ ఆర్డర్‌ను సమర్థవంతంగా నిర్వహించి మంచి పోలీసు అధికారిగా గుర్తింపు తెచ్చుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయిలోని సిఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-కొల్లూరు

నిత్యావసరాలు అందజేస్తున్న దాతలు

కొల్లూరు మండలంలోని రావిలంక లో 120 వరద బాధిత కుటుంబాలకు ఈరే మినిస్ట్రీస్ సంస్థ డైరెక్టర్ కె.సుధీర్ కుమార్ దుస్తులు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిషప్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ మా మినిస్ట్రీ ద్వారా తిప్పలకట్ట గ్రామంలో 450 కుటుంబాలకు, పెదలంకలో 250 కుటుంబాలకు సహాయం చేశామన్నారు. లంక గ్రామాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. పేద ప్రజలకు సేవ చేయడంలో ఈరే మినిస్ట్రీ ముందుంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఈరే మినిస్ట్రీ బృందం గ్రామస్థులు పాల్గొన్నారు.

టమోటా రూ.100.!

- ఆకాశానంటున్న కూరగాయల ధరలు - ఆందోళన చెందుతున్న పేదలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం, మార్కాపురం

మార్కెట్లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. దాదాపు అన్ని కూరగాయలూ సెంచరీ మార్క్‌కు చేరువ అవుతున్నాయి. ముఖ్యంగా టమోటా ధర రూ.100కి చేరువైంది. కూరల్లో ఉల్లికి ఎంత ప్రాధాన్యత ఉంటుందో అంతే ప్రాధాన్యత టమోటాకి కూడా ఉంటుంది. అలాంటి టమోటా ధరలు ఇప్పుడు అమాంతం పెరిగిపోయాయి. యర్రగొండపాలెం ప్రాంతంలో ప్రతి రోజూ 20 టన్నుల టమోటాలు విక్రయిస్తుంటారు. అయితే ధర పెరగడంతో ఐదు టన్నులకు మించి విక్రయాలు జరగడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. టమోటాలను ఎక్కువగా కడప జిల్లా మైదుకూరు ప్రాంతం నుంచి దిగుబడి చేసుకుంటున్నట్లు తెలిపారు.

మిగతా కూరగాయాలదీ అదే దారి..

టమోటాతో పాటు ఇతర కూరగాయల ధరలూ మండుతున్నాయి. ఏ రకం కూరగాయలు కొనుగోలు చేద్దామన్నా రూ.60కి పైగానే ఉంటోంది. ఎప్పుడూ తక్కువగా ఉండే దుంప కూరగాయల ధరలు కూడా పెరిగాయి. దొండ, బెండ కిలో రూ. 70కి పైగా ఉంది. పచ్చిమిర్చి మాత్రం కిలో రూ.40కు విక్రయిస్తున్నారు. ఉల్లిగడ్డలు కిలో రూ.70కి పైగా ధర ఉంది. ఈ ధరలు ఇంతటితో ఆగేలా లేవు. ధరలు పెరగడం ఇప్పుడే మొదలైందని, మరింత ప్రియం కానున్నట్లు కూరగాయల మార్కెట్ నిర్వాహకులు చెబుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అన్నీ పెరిగిపోతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు.

గ్రామాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్

మాట్లాడుతున్న మంత్రి అనగాని

ప్రజాశక్తి - రేపల్లె

రాష్ట్రవ్యాప్తంగా గ్రామాభివృద్ధికి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు 2024 - 2025 ఆర్థిక సంవత్సరానికి సుమారు రూ.4500 కోట్లు మంజూరైనట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. మన పల్లెల్లో ఒక పండుగ వాతావరణంలో వివిధ అభివృద్ధి పనులను చేపట్టడానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారని చెప్పారు. పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాల పేరుతో ప్రతి గ్రామములో సిమెంట్ కాంక్రీట్ రోడ్లు, సిమెంట్ డ్రైన్లు, స్మశాన వాటికలకు కాంపౌండ్ వాల్ నిర్మాణము తదితర పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు శంకుస్థాపన కార్యక్రమాలు ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని రేపల్లె, నిజాంపట్నం, నగరం, చెరుకుపల్లి మండలాలలోని గ్రామాలలో మంజూరైన 71 పనులు చేపట్టేందుకు నిర్వహించే శంఖుస్థాపన కార్యక్రమాలలో ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ప్రజలు పాల్గొని విజయవంతం చెయ్యాలని కోరారు.

సాదాసీదాగా మండల సమావేశం

- అభివృద్ధి పనుల ఊసెత్తని ప్రజాప్రతినిధులు
- హాజరు కాని పలుశాఖల అధికారులు
- గంటన్నరలో ముగిసిన వైనం

ప్రగతి నివేదికలు వినిపిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

బల్లికురవ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే మండల సమావేశం మొక్కుబడిగా సాగింది. ఈ సమావేశంలో గ్రామాల్లోని సమస్యలు, అభివృద్ధిపై చర్చించేందుకు అవకాశమున్నా తూతూమంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకున్నారు. పలు శాఖల అధికారులు సైతం గైర్హాజరయ్యారు. సమావేశ ప్రారంభమయ్యాక కూడా అధికారుల, ప్రజాప్రతినిధుల రాక కొనసాగింది. పలుశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సభ్యులు ఎవరూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకురాలేదు. స్థానిక బల్లికురవ తెలుగుదేశం పార్టీ వార్డు సభ్యురాలు పావులూరి దుర్గభవాని మాట్లాడుతూ బల్లికురవలో టిడిపి అధికారం చేపట్టినప్పటి నుంచి ఎటువంటి పంచాయతీ సమావేశాలు జరగలేదన్నారు. వార్డు నెంబర్లకు సమాచారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశం గంటన్నరలో ముగిసింది. ఈ కార్యక్రమంలో మండల టిడిపి సీనియర్ నాయకులు మలినేడి గోవిందరావు, గొట్టిపాటి లక్ష్మయ్య, పావులూరు మోహన్ రావు, ఎంపీడీవో కుసుమకుమారి, సర్పంచులు, ఎంపీటీసీలు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

నిందితులు అరెస్టు

పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

ప్రేమ పేరుతో బాలికను వేధించి, ఆమె కుటుంబ సభ్యులపై కత్తితో దాడి చేసిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు చెరుకుపల్లి ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. ఈనెల 7వ తేదీ అర్ధరాత్రి మండల పరిధిలోని కనగాలలో పదో తరగతి బాలిక ఇంటికి వెళ్లి బాలిక మరియు కుటుంబ సభ్యులపై దాడి చేసి గాయాలపాలు చేసిన రాజోలు గ్రామానికి చెందిన కుంచాల భార్గవ్ రెడ్డి, ఇతనికి సహకరించిన అదే గ్రామానికి చెందిన విజయ భాస్కర్ రెడ్డిలను బుధవారం గూడవల్లి సమీపంలో అరెస్ట్ చేసి రేపల్లె కోర్టుకు రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లుగా ఎస్ఐ తెలిపారు. బాలిక తండ్రి షేక్ మస్తాన్ వలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లుగా తెలిపారు. క్షతగాత్రులు రేపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఫిర్యాదు చేశారు.

మాట్లాడుతున్న కమిషనర్ సయ్యద్ రషీద్

నీటి పన్ను వసూలు చేయాలి

కమిషనర్ సయ్యద్ రషీద్

ప్రజాశక్తి - చీరాల

నీటి పన్నులు సక్రమంగా వసూలు చేయాలని, నీటిని ప్రతిరోజూ పరీక్షించాలని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ రషీద్ సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వార్డు శానిటేషన్ మరియు ఎన్విరాన్మెంట్ సెక్రెటరీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రోజువారీ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ట్రేడ్ లైసెన్సు నూరు శాతం వసూలు చేయాలని ఆదేశించారు. అనంతరం వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు ఇంటి, ఖాళీ స్థలము, కుళాయి పన్నులను నూరుశాతం వసూలు చేయాలని, మార్కెట్లకు సంబంధించి లీజులు, షాపు రూములకు సంబంధించి అద్దెలు ఆలస్యము లేకుండా వసూలు చేయవలసినదిగా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారి, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు. కారంచేడు రోడ్డు 31వ వార్డులో డ్రైనేజీ గ్యాంగు వర్కు ద్వారా సిల్టు తీసే పనిని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీరు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, శానిటరీ మేస్త్రీలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

రేపల్లె సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

చట్టాలపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని రేపల్లె సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వరరావు అన్నారు. భట్టిప్రోలు పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం మహిళ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. భట్టిప్రోలు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి న్యాయమూర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహిళలకు చట్టంలో అనేక నూతన సెక్షలను పొందుపరచడం జరిగిందన్నారు. సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలు, హత్యాచార ఘటన పట్ల ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా చట్టాలపై అవగాహన పెంచుకొని, నిర్భయంగా ఫిర్యాదు చేసుకోవచ్చున్నారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన బాధితులకు పోలీసులు కేసు తీసుకోకపోతే దానిపై అధికారులకు ఫిర్యాదు చేయడం ద్వారా కూడా కేసు నమోదు చేసుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా నిరుపేదలకు జరిగిన అన్యాయంపై కోర్టులో వాదించుకొనే న్యాయవాదిని కూడా ఏర్పాటు చేసుకోలేని స్థితిలో ఉంటే అట్టివారికి మండల లీగల్ సెల్ ద్వారా ఫిర్యాదు చేస్తే ఉచితంగా న్యాయవాదిని కేటాయించి ఉచిత న్యాయ సహాయాన్ని పొందేందుకు కూడా అవకాశం ఉందన్నారు. ఈ మండల లీగల్ సెల్ చైర్మన్గా న్యాయమూర్తి ఉంటారని వారికి ఫిర్యాదు చేస్తే సత్వర న్యాయ పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ధార రవి కిరణ్మయి, తహశీల్దార్ మేక శ్రీనివాసరావు, మండల పరిపాలన అధికారి సిహెచ్ జలజ, సీనియర్ న్యాయవాదులు షేక్ అమీనా రహమాన్, తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు నియోజకవర్గాన్ని..

అభివృద్ధి పథంలో నడిపిస్తా..

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

ప్రజాశక్తి-గిద్దలూరు

గిద్దలూరు నియోజకవర్గాన్ని అభివద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో తాగునీరు, గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలు..తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గతంలో టిడిపి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం కొన్ని పనులు మొదలుపెట్టగా ఆ తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకుండా నిలిపివేసిందన్నారు. ప్రస్తుతం మళ్లీ టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిందని, తాగునీటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. బుధవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా 'ప్రజాశక్తి'తో గిద్దలూరు అభివృద్ధిపై చర్చించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం

గతంలో టిడిపి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గ్రామాలలో పారిశుధ్య సమస్య పరిష్కరించడానికి పెద్ద పీట వేశా.. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో 60 శాతానికి పైగా ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు వేయించి డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేశా.. గిద్దలూరు పట్టణంలో నాడు రూ.25 కోట్ల వ్యయంతో సిమెంట్ రోడ్లు నిర్మించగా గ్రామాలలో పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి శాఖల ద్వారా రూ.90 కోట్లు వెచ్చించి తారు రోడ్ల నిర్మాణం చేపట్టాం.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

నాడు టిడిపి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పట్టణానికి రామన్న కతువా నుంచి నీటి సరఫరా చేసేందుకు రూ.300 కోట్ల టెండర్లు పూర్తయినప్పటికీ గత వైసిపి ప్రభుత్వం చేతులెత్తేసింది. నేడు కూటమి అధికారంలోకి రావడంతో గతంలో మంజూరైన ఈ పనులను పూర్తి చేసి పట్టణానికి నీటి సమస్య లేకుండా చేయాలనే దఢ సంకల్పంతో ఉన్నాం..

త్వరలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం

పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై కూడా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రత్యేక దష్టిసారించారు. అయితే ఈ సమస్యపై జిల్లా ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డితో పాటు జిల్లాకు చెందిన పలువురు మంత్రులతో కూడా చర్చించాం. ఏదిఏమైనా రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి పట్టణవాసులకు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కషి చేస్తా..

సగిలేరు వాగు సమస్య పరిష్కారానికి కృషి

పట్టణంలోని సగిలేరు వాగు వర్షాకాల సమయంలో ఉదత ప్రవాహం వల్ల అనేక సందర్భాలలో సగిలేరు పరివాహక ప్రాంతాలైన సత్యనారాయణ నగర్, శ్రీనివాస థియేటర్ లైన్, కొంగలవీడు రోడ్డు, విశ్వ భారతి స్కూల్ పరిసర ప్రాంతాలలో ప్రాణ, ఆస్తి నష్టాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. దీని కారణంగా ఆ ప్రాంతాలలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అయితే ఈ సమస్య పరిష్కారానికి నాటి టిడిపి ప్రభుత్వంలో సగిలేరు వాగుకు రిటైనింగ్ వాలు తదితర పనులకు గాను 16 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయించినప్పటికీ గత వైసిపి ప్రభుత్వం నిర్వాకంతో ఈ నిధులు వెనక్కి వెళ్లాయి. అయితే నేడు కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో తాను ఈ సమస్యను కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి.. త్వరలో సమస్య పరిష్కరిస్తారానికి కృషి చేస్తాం..

ఆర్థిక సాయం అందజేస్తున్న యూనియన్ నాయకులు

విద్యుత్ కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - రేపల్లె

మండలంలోని రావిఆనంతరం గ్రామంలో కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికుడు పిల్లి శేఖర్ అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మిక యూనియన్ నాయకులు పరామర్శించి రూ.21,500 ఆర్థిక సాయం అందజేశారు. పిల్లి శేఖర్ కుటుంబాన్ని ఆదుకోవటానికి ఇంటిలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని తెనాలి డివిజన్ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల అధ్యక్షులు బొర్రా సురేష్, సిఐటియు బాపట్ల జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులు చనిపోతే వాళ్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, కావున ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవడానికి ముందుకు రావాలని మానవతా దృక్పథంతో కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు యూనియన్ నుండి కె.అంబేద్కర్, గోవర్ధన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ధనలక్ష్మి రూపంలో అమ్మవారు దర్శనం

ప్రజాశక్తి - పంగులూరు

ధనలక్ష్మి అలంకరణలో అమ్మవారు

దేవి శరన్నవరాత్రులు సందర్భంగా ఆరో రోజు అయిన మంగళవారం పంగులూరు గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన అమ్మవారు ధనలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మాజీ సైనికోద్యోగి చిలుకూరి ప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో అమ్మవారిని రూ.7 లక్షల రూపాయల విలువైన నోట్లతో అలంకరించారు.

గజలక్ష్మి అలంకరణలో అమ్మవారు

ప్రజాశక్తి అద్దంకి

పట్టణంలోని శ్రీ చక్ర సహిత శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో 53వ దేవి శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా ఆరో రోజు గజలక్ష్మి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా దేవస్థానం సమీపంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

సత్యనారాయణను సన్మానిస్తున్న దృశ్యం

సూర్యనారాయణకు సేవా పురస్కారం

ప్రజాశక్తి-వేటపాలెం

సౌత్ ఇండియా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ చైర్మన్ కుర్ర సూర్యనారాయణకి బెంగళూరు సోమయాజులు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ ఉత్తమ సేవా పురస్కారం అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం ఓ ప్రైవేటు హోటల్లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు సూర్యనారాయణను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వెన్నెల రమేష్, శ్రీరామ్ సురేష్, ఆలపాటి సురేష్, గంగాధర్, వెంగళరావు, శీలం రెడ్డి, రాంబాబు, కిరణ్, ఆత్మకూరి భార్గవరావు పాల్గొన్నారు.

సమస్యలు లేని పంచాయతీలను నిర్మిద్దాం

ఎంపీడీవో స్వరూప రాణి

ఉపసర్పంచులు, వార్డు మెంబర్లకు శిక్షణ

మాట్లాడుతున్న ఎంపీడీవో స్వరూప రాణి

ప్రజాశక్తి - పంగులూరు

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా సమస్యలు లేని పంచాయతీలను నిర్మిద్దామని ఎంపీడీవో కె.స్వరూప రాణి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండలంలోని గ్రామ ఉపసర్పంచులు, వార్డు మెంబర్లుకు జరిగిన శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం రావాలంటే గ్రామపంచాయతీలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. గ్రామాల్లో మంచినీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించినప్పుడు సమస్యలే ఉండవని తెలిపారు. పంచాయతీ నిర్మాణంలో వార్డు మెంబర్లు, ఉపసర్పంచిల పాత్ర కీలకమైందన్నారు. ఆ సమావేశంలో తీసుకునే నిర్ణయాలే గ్రామ పంచాయతీ అభివృద్ధికి బాటలు వేస్తాయని ఆమె తెలిపారు. ఈఓఆర్‌డి సుమంత్ మాట్లాడుతూ, పంచాయతీలకు వచ్చే నిధులను సక్రమంగా అభివృద్ధి పనులకు ఖర్చు పెట్టడంలో ఉప సర్పంచ్ వార్డు మెంబర్లు కీలకంగా వ్యవహరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పంచాయతీ సెక్రటరీ బి.రాంబాబు, రామ్ సునీత తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పం గులూరు సర్పంచి గుడిపూడి నాగేంద్రమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, వెంకట సుబ్బా రావు, సెక్రటరీలు, ఉపసర్పంచులు పాల్గొన్నారు.

సంతమాగులూరు: మండల పరిషత్ కార్యాలయం సమావేశం హాలులో గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్, వార్డు మెంబర్లకు శిక్షణా కార్యక్రమాన్ని ఎంపీడీవో జ్యోతిర్మయి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎన్.శివరామ ప్రసాద్, పత్తేపురం గ్రామ సర్పంచి అయినాల గోపి, కార్యదర్శి పూర్ణచంద్రరావు, నరేష్, ఏపీవో సురేష్, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, సర్పంచులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

యద్దనపూడి: యద్దనపూడి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మహ్మద్ అఖాబ్ జావీద్ అధ్యక్షతన మంగళవారం శిక్షణ నిర్వహించారు. పంచాయతీ చట్టంపై ఉప సర్పంచి, వార్డు మెంబర్లు, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు.

నిబంధనల మేరకు అనుమతివ్వాలి

సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట్ త్రివినాగ్

ప్రజాశక్తి-మార్కాపురం

స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

దీపావళి సందర్భంగా బాణాసంచా విక్రయ దారులకు నిబంధనల మేరకు అనుమతి ఇవ్వాలని మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట్ త్రివినాగ్ అధికారులకు సూచించారు. బాణాసంచా దుకాణాల సముదాయాన్ని మార్కాపురంలోని ఎస్‌వికెపి కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని సబ్ కలెక్టర్ త్రివినాగ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారుల పాత్ర కీలకమన్నారు. కఠినమైన నిబంధనలు పాటించేలా చర్యలు ఉండాలన్నారు. ఆయన వెంట తహశీల్దారు కె.చిరంజీవి, మార్కాపురం సిఐ పి.సుబ్బారావు, పట్టణ ఎస్ఐ ఎం.సైదుబాబు తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులపై వీడియో కాన్ఫరెన్స్

ప్రజాశక్తి-అద్దంకి

పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వీడియో కాన్ఫరెన్స్‌లో మంగళవారం నిర్వహించారు. ఎంపీడీవో, ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడే పలు అంశాల గురించి ప్రస్తావించారు. వంద రోజులు ఉపాధి కల్పించడం, సుస్థిర ఆస్తులు ఏర్పాటు చేసి జీవనోపాదులు మెరుగు పరచడం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ముఖ్య ఉద్దేశం అన్నారు. పని ప్రదేశంలో కూలి మరణించినా, లేదా పూర్తిగా అంగవైకల్యానికి గురైనా ఆ కుటుంబానికి రూ.50 వేల నష్టపరిహారం చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులలో వ్యక్తిగత రైతులకు చెందిన పండ్ల తోటలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పలు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు వెల్లడించారు.

బాధ్యతలు స్వీకరించిన కార్యదర్శులు

ప్రజాశక్తి-వేటపాలెం

సాధారణ బదిలీలలో భాగంగా మంగళవారం పలువురు ఉద్యోగులు బాధ్యతలు స్వీకరించారు. మండల ఈఓఆర్‌డిగా అన్నం శ్రీనివాస్ ఇంకొల్లు నుండి వచ్చారు. పాపాయిపాలెం కార్యదర్శిగా పలనం పూర్ణ కుమారి, అక్కయ్యపాలెం కార్యదర్శిగా షేక్ గౌస్ మహమూద్ మహమ్మదీన్, కేశవ పేట కార్యదర్శిగా టి.వెంకటేశ్వరరావు, పులరపాలెం కార్యదర్శిగా శ్రీనివాస్, పందలపల్లి కార్యదర్శిగా టి.మాల్యాద్రి రావు, వేటపాలెం కార్యదర్శిగా ఎమ్.మోహన్ రంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. బుధవారం చల్లారెడ్డి పాలెం కార్యదర్శిగా వేమూరి రామ్మోహన్‌రావు విధులలో చేరనున్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి మోపిదేవి పరామర్శ

ప్రజాశక్తి - నగరం

ఇటీవల హత్యకు గురైన మండలంలోని దాసరి పాలెం గ్రామానికి చెందిన నున్న భూషయ్య కుటుంబ సభ్యులను మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణారావు మంగళవారం పరామర్శించారు. పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. భూషయ్య కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అధైర్య పడవద్దని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం అదే గ్రామానికి చెందిన నున్న వీరయ్య భార్య మృతి చెందిన సంగతి తెలుసుకున్న మోపిదేవి నున్న వీరయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నగరం ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, నిజాంపట్నం మాజీ ఎంపీపీ ప్రసాదం, వాసుదేవరావు ఉన్నారు.

ఆధార్ కార్డులు మంజూరు

ప్రజాశక్తి - రేపల్లె

రేపల్లె మండలంలోని ఎస్టీలకు ఆధార్ కార్డు నమోదు కార్యక్రమం చేపట్టామని తహశీల్దార్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రేపల్లె మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఆధార్ కార్డు లేని ఎస్టీలకు కార్డులు మంజూరు చేశారు. పెనుమూడి, చాటగడ్డ, విశ్వేశ్వరం, బొబ్బర్లంక, చోడయపాలెం, కైతేపల్లి, రాజు కాలవ, లంకేవాని దిబ్బ, నిర్మల్ నగర్ గ్రామాలలో గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది ఆధార్ కార్డు లేని వారి వివరాలను సేకరించి పేర్లు నమోదు చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రసాయన ఎరువుల వాడకంతో అనర్థం

వ్యవసాయ అధికారి చందవోలు సునీత

ప్రజాశక్తి-వేమూరు

అధిక రసాయన ఎరువుల వాడకంతో అనర్థాలు తప్పవని వ్యవసాయ అధికారి చందవోలు సునీత అన్నారు. వేమూరు మండలం పెనమర్రు, కోడిపర్రుల్లో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో సునీత మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల వలన కలిగే లాభాల తెలియజేశారు. సమగ్ర పోషక యజమాన్య పద్ధతులు గురించి రైతులకు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో పెనమర్రు వివిఎ చిరంజీవి, వీఆర్వోలు, కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

అద్దంకి: మిరపలో జిగురు అట్టలు పెట్టుకోవాలని ఉద్యాన అధికారిణి ఎస్.దీప్తి సూచించారు. వెంపరాల, చక్రాయ పాలెం లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొ న్నారు. ఈ కార్యక్రమంలో ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ ఈ పంట నమోదు 100 శాతం పూర్తి చేసినట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు శేషయ్య పాల్గొన్నారు.

ఇంకొల్లు: మండలంలోని వంకాయలపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయాధికారి అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు మోహనరావు మాట్లాడుతూ శనగ రైతులు విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ వేసిన ప్రతి పంటను ఇ-పంట లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువర్ధక గ్రామ సహాయకులు, మార్కెటింగ్ శాఖ, వీఎఎ, టీడీపీ నాయకులు సురేషు, రైతులు పాల్గొన్నారు.

సంతమాగులూరు: మండలంలోని కొమ్మాలపాడు గ్రామంలో రైతులు సాగు చేసిన మిర్చి పంట పొలాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవ సాయ సిబ్బంది వెంకటరత్నం, రవి కిరణ్, అనిల్, అఖిల్, ఐసిఆర్‌పియులు నూరిమ, కాలేషావలి పాల్గొన్నారు.

భట్టిప్రోలు: మండలంలోని ఐలవరంలో మంగళవారం వరి పైరు పై ఆశించే పురుగు ఉద్రిక్త నివారణకు ఆకులు ఆలమలతో కూడిన అగ్రహారం ద్వారా పూర్తిగా నివారణ జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎల్1 గుర్రం పాండురంగారావు తెలిపారు.

నగరం: మండల పరిధిలోని దూళిపూడి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి వి.రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు, వ్యవసాయ అనుబంధశాఖలతో కలిపి పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కె.నాగ శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకుడు ప్రసాద్, గ్రామ ఎంపీఈవోలు, టిడిపి నాయకులు చిరకాల చలమయ్య, రైతులు పాల్గొన్నారు.

వంకాయలపాడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కర్లపాలెంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కర్లపాలెం: రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందాలని బాపట్ల రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్ అన్నారు. మంగళవారం కర్లపాలెం మండలంలోని గణపవరం, చింతయపాలెం గ్రామాలల్లో వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఎం.సుమంత్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమములో ఏఈ ఓ కె భాగ్యలక్ష్మి, వివిఎ జి.వేద శ్రీ, ఎంపీఈవో ధ్రువకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

కారంచేడు: మండలంలో జరుబులవారిపాలెం, నాయుడువారి పాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, మార్కెటింగ్ శాఖ అధికారులు, గ్రామ వ్యవ సాయ సహాయకులు కిషోర్ పాల్గొన్నారు.

పర్చూరు: పర్చూరు మండలంలోని గొల్లపూడి, అడుసుమల్లి గ్రామలలోని రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పంట సాగు చేసిన రైతులు ఈ-పంట నందు నమోదు చేసుకోవాలని ఏడీఏ మోహనరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో మేరిమ్మ, ఉద్యానవన శాఖ అధికారి రవి ప్రకాష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

సిడిపివో కృష్ణకుమారికి కార్యకర్తల వినతి

ప్రజాశక్తి-అద్దంకి

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సిడిపివో ఎ.కృష్ణకుమారికి వినతిపత్రం అందజేశారు. కొరిశపాడులో నిర్వహించిన ప్రాజెక్టు సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని సిడిపివోని కోరారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి జి.శారద మాట్లాడుతూ అంగన్‌వాడీలకు అనేక రకాల ఆన్‌లైన్ యాప్ ద్వారా వర్క్ చేయవలసి వస్తుందని, దీనివలన వర్కర్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని యాప్‌లు ఒకే దానిలో వినియోగించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా సమ్మె కాలంలో గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఓటీపీ పద్ధతిని రద్దు చేయాలని, అంగన్‌వాడీల ద్వారా సామాజిక పెన్షన్ పంపిణీని నిలుపుదల చేయాలని ఈ సందర్భంగా సిడిపిఓ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు తంగరాల వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పార్వతి, మనోలత, భాగ్యలక్ష్మి, రేవతి, ప్రాజెక్టు సెక్టార్ల నాయకులు పాల్గొన్నారు.

రేపల్లె: అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని రేపల్లె ఐసిడిఎస్ సిడిపివో ఏ.సుచరితకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.మణిలాల్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్షురాలు కె.రూబీన్సీ మాట్లాడారు. కార్యకర్తలకు పనిభారం పెరిగిందని, ఫోన్లు సక్రమంగా పనిచెయ్యటంలేదని, కొన్ని ప్రాంతాల్లో నెట్ సిగ్నల్స్ లేనందువల్ల యాప్స్ నిర్వహించడానికి ఇబ్బందులకి గురౌతున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ సెక్టార్ లీడర్లు ఎన్.కృష్ణకుమారి కె.రత్న కుమారి, డి.జ్యోతి, బి.రజని, శివనాగాలు పాల్గొన్నారు.

నిజాంపట్నం: పనిభారం తగ్గించాలని కోరుతూ పల్లపట్ల ఐసిడిఎస్ సిడిపిఓ అనుసూయకి అంగన్వాడీ కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ప్రాజెక్ట్ అధ్యక్షురాలు వై.మేరీమణి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహణలో అనేక సమస్యలు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు బేబీరాణి, సంతోష కుమారి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల: జిల్లా అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి రేఖ ఎలిజబెత్ ఆధ్వర్యంలో మంగళవారం ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టరుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రేఖ ఎలిజబెత్ మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్ నిర్వహణకు లబ్దిదారుల లిస్టును నమోదు చెయ్యటానికి పోషణ ట్రాకర్ యాప్ బాల సంజీవిని యాప్లో నమోదుతో అంగన్వాడీలపై పనిభారం పెరిగిందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో అంగన్వాడీ యూనియన్ నాయకులు శైలశ్రీ, హేమ, సీత, పార్వతి తదితరులు ఉన్నారు.

బాపట్లలో వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

రేపల్లెలో వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

రోడ్డు ప్రమాదంలో 12 మందికి గాయాలు

గుంటూరు జిల్లా కాకుమాను-రేటూరు రోడ్డులో ప్రమాదం

బాధితులు క్రోసూరు మండలం, తాళ్లూరు వాసులుగా గుర్తింపు

ప్రజాశక్తి-బాపట్ల

గుంటూరు జిల్లా కాకుమాను మండలం రేటూరు-కాకుమాను మార్గంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ఆటోలు ఢీకొని 12 మంది గాయపడ్డారు. అందిన వివరాల మేరకు.. రెండు ఆటోలు ఒక దాని వెనుక ఒకటి ఢీ కొట్టుకోవడంతో ఈ ప్రమాదం జరిగింది. సుమారు 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని బాపట్ల ఏరియావైద్య శాలకు తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వారిని గుంటూరు వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి గురైనవారు క్రోసూరు మండలం తాళ్లూరు గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. సోమవారం కొండపాటూరులో పోలేరమ్మను దర్శించుకునేందుకు వచ్చారు. అక్కడి నుండి బాపట్ల సూర్యలంక బీచ్ సముద్ర తీరానికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

వరద బాధితులకు విరాళం అందజేత

ప్రజాశక్తి-భట్టిప్రోలు

వరద బాధితులకు భట్టిప్రోలు తమ్మన మల్లిఖార్జున రావు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు సేకరించిన రూ.33,880లను ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు. మంగళవారం వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి శ్రీ నక్కా ఆనంద బాబుకు ఈ మేరకు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ పి.మల్లిఖార్జునరావు, ఎస్ఎంసి ఛైర్మన్ ఏ.సుగుణ, ప్రధానోపాధ్యాయులు సి.రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు సిహెచ్ ఉమామహేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిఎం విశ్వకర్మ యోజన ధ్రువీకరణ పత్రం అందజేత

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన కార్పెంటర్ అసోసియేషన్ సభ్యులు కోడూరు వెంకటేశ్వరరావుకు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద ధ్రువీకరణ పత్రాన్ని మంగళవారం ఎంపిపి డివి లలిత కుమారి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రతి కార్పెంటర్ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పాలన అధికారి సిహెచ్ జలజ, ఏపీఓ శివ పార్వతి, ఏపిఎం శ్రీమన్నారాయణ, మల్లేశ్వరరావు తదితరులున్నారు.

మద్యం దుకాణాలకు 1000 దరఖాస్తులు.!

- నేటితో ముగియనున్న గడువు..
- కూటమి కడుతున్న మద్యం వ్యాపారులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో ఈ నెల 12 నుంచి ప్రైవేట్ రంగంలో 117 మద్యం దుకాణాలు రానున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం నాటికి వెయ్యి దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీని ఖరారు చేసి ఈ అక్టోబరు 12 నుంచి 2026 సెప్టెంబర్ 30 వరకు నూతన మద్యం దుకాణాల కోసం లైసెన్సులు ఇవ్వనుంది. జిల్లాలోని బాపట్ల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 19, వేమూరు 12, రేపల్లె 12, నగరం 12, చీరాల 24, అద్దంకి 23, పర్చూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 15 మద్యం దుకాణాలు రానున్నాయి. మద్యం దుకాణాల కోసం ఒకరు ఎన్ని దరఖాస్తులైనా చేసుకునే అవకాశం కల్పించారు. ఒక్కో షాపునకు రూ.2 లక్షలు చొప్పున నాన్ రిఫండబుల్ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. మద్యం వ్యాపారుల మధ్య దుకాణాల కోసం పోటీ పెరిగి కోట్ల రూపాయల మేర కోసం దరఖాస్తు రుసుం వస్తుందని ప్రభుత్వం భావించింది. అధికారపార్టీ నేతల అండ లేకుండా మద్యం దుకాణాలు నిర్వహించడం కష్టమైన నేపథ్యంలో గతంలో ఈ వ్యాపారంలో ఉన్నవారు, కొత్తగా మద్యం వ్యాపారంలోకి వస్తున్న వారు స్థానిక ప్రజాప్రతినిధులను కలసి ఇప్పటికే మంతనాలు పూర్తి చేశారు. జిల్లాలో ఒక్కొక్క నియోజకవర్గం ఒక్కో తీరున సిండికేట్ అయ్యి మద్యం దుకాణాల లైసెన్స్ పొందేందుకు కసరత్తు చేశారు. దుకాణాల కేటాయింపులు ఎలా అనే విషయమై నెలకొన్న సందిగ్ధత కారణంగా ఆదివారం వరకు దరఖాస్తులు అరకొరగానే వచ్చాయి. సోమవారం నాటికి వెయ్యి వరకు వచ్చాయి. అధికారులు జిల్లాలో ఒక్కొక్క దుకాణానికి 10 వరకు దరఖాస్తులు వస్తాయని భావిస్తూ వచ్చారు. కానీ అధికార పార్టీకి చెందిన ముఖ్య నేతలు ఉన్న చోట వారిని కాదని మద్యం వ్యాపారం చేయడం కష్టసాధ్యాలతో కూడుకున్న అంశమని భావించి.. ఎవరూ పోటీ పడే సాహసం చేయడం లేదు. ప్రజాప్రతినిధులతో అన్ని విషయాలూ మాట్లాడుకున్న మద్యం వ్యాపారులు మాత్రమే సిండికేట్ అయి దరఖాస్తు చేశారు. సిండికేట్ అయిన వారితో కలవకుండా కొన్ని చోట్ల వారికి ప్రత్యర్థులుగా అధికార పార్టీ మద్దతు ఉన్న వారు కూడా సిండికేట్ అయి దరఖాస్తు చేశారు. ఇలాంటి చోట్ల ఇరు గ్రూపుల వారు కూడా ఒక్కొక్క దుకాణానికి 5 నుంచి 7 వరకు దరఖాస్తులు చేశారు. ఇలా పోటీ ఉన్న చోట్ల దుకాణాల లాటరీలు అయ్యాక ఎవరికి మద్యం దుకాణాలు దక్కాయో చూసి ఎవరు ఏ దుకాణం తీసుకోవాలన్నది నేతలు నిర్ణయించనున్నారు. కొన్ని దుకాణాలను నేతలే పెట్టుబడి పెట్టి తీసుకుంటుండగా.. మరి కొన్ని దుకాణాలలో 10 నుంచి 20 శాతం వాటా అధికారపార్టీ నేతలకు వెళ్లనుంది. కొన్ని షాపుల్లో ప్రజాప్రతినిధుల తరపు వారు నేరుగా సిండికేట్‌లో భాగస్వాములు కానున్నారు. ఎలా చూసినా జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో ప్రతి మద్యం దుకాణం అధికారం అండగానే నడవనున్నట్లు స్పష్టమవుతోంది.

మాలల చైతన్య సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - రేపల్లె

మాలల చైతన్య సదస్సును జయప్రదం చేయాలని జై భీమ్ రావు భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది దోవా రమేష్ రాంజీ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను ఉప కులాల వారీగా వర్గీకరించి క్రిమిలేయరును అమలు పరచుకోవచ్చునని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఈనెల 12న శనివారం ఉదయం 10 గంటలకు నగరం మండలం సజ్జావారిపాలెంలోని లక్ష్మీ గణపతి ఫంక్షన్ హాల్లో మాలల చైతన్య సదస్సును నిర్వహించనున్నట్లు చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పుపై అంబేద్కర్ యువజన సంఘాలు మాల విద్యార్థులు యువతను, విద్యావంతులను చైతన్యం చేసేందుకు ఈ సదస్సును నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సదస్సులో మాల మహాసభ జాతీయ అధ్యక్షులు మల్లెల వెంకటరావు, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ళ అరుణ్ కుమార్, పాల్గొంటారని తెలిపారు. అధిక సంఖ్యలో తరలివచ్చి మాలల చైతన్య సదస్సును జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సముద్రంలో మునిగిపోతున్న ఇద్దరిని కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

సూర్యలంక సముద్ర తీరంలో విహారానికి వచ్చిన యాత్రికులు ఇద్దరు అలలు తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోతుండగా అవుట్ పోస్టులో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది, మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు వారి ప్రాణాలను కాపాడారు. సికింద్రాబాద్‌కు చెందిన దయాకర్ మహేష్ చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. మహేష్ కుటుంబ సభ్యులతో విహార యాత్రకు సూర్యలంక సముద్ర తీరానికి వచ్చాడు. సముద్రంలో మునుగుతూ పోలీస్ హెచ్చరికలను పట్టించుకోకుండా లోతుకు వెళ్లడంతో ఒక్కసారిగా అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోతుండగా పోలీసులు రక్షించారు.

మరొక ఘటనలో గుంటూరు పట్టణంలోని లక్ష్మీపురంకు చెందిన నున్న మహేష్ అనే బాలుడు సముద్రంలో స్నానం చేస్తుండగా అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోతుండగా కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో గుర్తించిన పోలీసులు బాలుడు ప్రాణాలను కాపాడారు. వీరికి ప్రథమ చికిత్స అందించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీస్ సిబ్బంది, గజ ఈతగాళ్ళు స్పందించిన తీరు పట్ల యాత్రికులు హర్షం వ్యక్తం చేశారు. పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో సూర్యలంక, వాడరేవు, రామాపురం బీచ్‌లలో యాత్రికుల రక్షణకు పటిష్ట చర్యలు తీసుకున్నామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లా పోలీస్ అధికారులు సూర్యలంక సముద్రతీరంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసారు.

మెటీరియల్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-బాపట్ల

ఉపాధ్యాయ ఉద్యోగాలకు పోటీ పడుతున్న డీఎస్సీ అభ్యర్థులు మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని, ఉద్యోగాలు సాధించాలని బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ అన్నారు. త్వరలో ప్రభుత్వం నిర్వహించనున్న డీఎస్సీ పరీక్షలకు అభ్యర్థులకు ఉపయోగపడే విధంగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణ రావు తయారు చేసిన సైకాలజీకి సంబంధించిన మెటీరియల్ పుస్తకాన్ని యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు జడ వినయ్ కుమార్, కోశాధికారి యం.వెంకటేశ్వర రెడ్డి, జిల్లా కార్యదర్శి మద్దాల సురేష్, యుటిఎఫ్ నాయకులు ప్రభాకర్, నన్నూరయ్య, వి.చక్రధర్, పోలీస్ రావు, నాగ రామారావు పాల్గొన్నారు.

పశువైద్యశాలను అభివృద్ధి చేయండి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

50 సంవత్సరాల క్రితం దాతల సహకారంతో నిర్మించిన పశువైద్యశాల పాత భవనాన్ని తొలగించి ప్రస్తుతం ఉన్న భవనం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి పశువైద్యశాల అభివృద్ధికి సహకరించాలని జిల్లా వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌కి కోలలపూడి గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని కోలపూడిలో మంగళవారం డిప్యూటీ డైరెక్టర్ రమేష్ పశు వైద్యశాల భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు కందిమళ్ళ రామకోటేశ్వరరావు, సర్పంచి మోరపాకుల సతీష్ కుమార్ పశు వైద్యశాల సమస్యను డిడి దృష్టికి తీసుకెళ్లారు. కోలలపూడి గ్రామంలో పశువైద్యశాల ముందు శిథిలావస్థకు చేరిన పాత భవనాన్ని తొలగించి ప్రహరీ గోడ నిర్మిస్తే పశువులకు వైద్యం అందించడానికి సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. వినతి పత్రం అందజేస్తే ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పశు వైద్యాధికారి మధులత, రంగబాబు, వీరాంజనేయులు, తిరుపతి రాంబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

‘స్వర్ణాంధ్ర’ విజన్‌తో

రానున్న తరాలకు ఎంతో ప్రయోజనం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

స్వర్ణాంధ్ర-2047 విజన్ అభివద్ధి రాబోయే పౌరులకు ఎంతో ప్రయోజనంగా మారనుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. స్వర్ణాంధ్ర 2047 జిల్లా స్థాయి అవగాహన సదస్సు మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. మంత్రి రవికుమార్ మాట్లాడుతూ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్‌ను నిలపడానికి కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు వెళుతుందని చెప్పారు. అధికారులు బాధ్యతతో శ్రమిస్తేనే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోగలమన్నారు. మన దేశంలో అధికంగా ఉన్న మానవ వనరులను సద్వినియోగం చేసుకుంటేనే అభివద్ధి బాటలో పయనిస్తుందన్నారు. రాబోయే పౌరులకు ఎంతో ప్రయోజనకరమన్నారు. బకింగ్‌హామ్ కెనాల్ అభివద్ధి చేసుకోగలిగితే బోట్ల ద్వారా రవాణా పెరుగుతుందని, ఆదాయ వనరుగా మారుతుందని పేర్కొన్నారు. తద్వారా కాలుష్యాన్ని పూర్తిస్థాయిలో నియంత్రించవచ్చన్నారు. 13వ శతాబ్దం నాటి మోటుపల్లి ఓడరేవును పున్ణనిర్మించడానికి అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. ప్రతి గ్రామానికి తాగునీరు అందాలని, మరుగుదొడ్లు ఉంటేనే స్వచ్ఛత అమలవుతుందని సూచించారు. బాపట్ల జిల్లాలో వ్యవసాయ, ఆక్వా రంగాలలో ఉత్పత్తులు గణనీయంగా పెరిగేలా ప్రణాళికలు రచించడం అభినందనీయమని చెప్పారు. గుంటూరు ఛానల్ విస్తరణ చేపట్టాలన్నారు.

పేదరిక నిర్మూలన లక్ష్యంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ప్రజల జీవనం మెరుగుపడాలని సూచించారు. బాపట్ల జిల్లా అభివద్ధికి అందరూ సహకరించాలన్నారు. గ్రామస్థాయిలో అభివద్ధి జరిగితే జిల్లా, రాష్ట్రం, దేశం పురోభివద్ధిలో పయనిస్తుందన్నారు. స్వర్ణాంధ్ర దిశగా బహత్తరమైన ప్రణాళిక, మంచి ఆలోచనలతో రాష్ట్రాన్ని అభివద్ధిలోకి సీఎం తీసుకువెళ్తున్నారని వివరించారు. అభివద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి నిరంతరం కషి చేస్తున్నారని అభివర్ణించారు. ప్రజలకు మెరుగైన జీవనం అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు.

వికసిత భారత్ 2047 దిశగా అందరూ అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. స్వర్ణాంధ్ర లక్ష్యం, విజన్ బాపట్ల దిశగా అడుగులు వేయాలని ఆయన సూచించారు. ప్రజల తలసరి ఆదాయం రూ.1.84 లక్షలు ఉండగా, రూ.15 లక్షలకు పెరగాలని ఆయన చెప్పారు. చీరాల ఏరియా ఆసుపత్రిని జిల్లా వైద్యశాలగా అభివద్ధి చేస్తామన్నారు. జిల్లాలో బౌద్ధ స్తూపం, సూర్యలంక బీచ్, చీరాల ఓడరేవు, నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ వంటీ అభివద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని ఆయన వివరించారు.

భవిష్యత్తు తరాలకు అందరూ కలిసికట్టుగా తోడ్పాటునందించాలని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. సూక్ష్మ ప్రణాళికతోనే అభివద్ధిని సాధించగలమన్నారు. ముఖ్యంగా వ్యవసాయానికి సమగ్ర ప్రణాళిక ఉండాలన్నారు. ప్రతి ఎకరాకు నీరందిస్తేనే ఇది సాధ్యమన్నారు. భవిష్యత్తు తరాలకు అన్ని వనరులు సమకూర్చాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

కోస్తా తీర ప్రాంతంలో ప్రజలందరికీ సురక్షితమైన తాగు నీరు సమద్ధిగా అందించగలిగితే అభివద్ధి బాటలోకి బాపట్ల జిల్లాలో అడుగులు వేస్తోందని చీరాల శాసనసభ్యులు ఎం.మాలకొండయ్య అన్నారు. చేనేత రంగాన్ని ఆధునికీకరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. చర్చించిన అంశాలన్నీ అమల్లోకి తీసుకురావాలన్నారు. మరింత ప్రాణాలతో ముందుకు సాగాలని ఆయన సూచించారు.

బాపట్ల జిల్లాలో బీచ్‌ల అభివద్ధి జరిగితే భవిష్యత్తులో అన్ని రంగాలు అభివద్ధిలోకి వెళ్తాయని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. అందుబాటులో ఉన్న వనరులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేస్తే అభివద్ధి చాలా సులువేనన్నారు. 2,047 నాటికి మనం ఏం చేయాలి, ఎలాంటి ఆలోచనలతో ముందుకు వెళ్లాలో ప్రణాళికలతో సాగాలన్నారు. అప్పుడే గాంధీజీ కన్న కలలు సహకారం అవుతాయన్నారు. ఆక్వా పర్యాటక రంగం అభివద్ధికి మంచి ప్రణాళికలు రూపొందించాలని ఆయన సూచించారు.

అనంతరం మత్స్యకారుల కోసం ఇస్రో రూపొందించిన ట్రాన్స్ పాండర్ లను 150 మంది మత్స్యకారులకు మంత్రులు, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. 40 వేల రూపాయలు విలువచేసి ఒక్కొక్క యంత్రం పనితీరును వివరించారు. స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంపై పాఠశాలల్లో ఏర్పాటుచేసిన క్విజ్, వక్తత్వ పోటీలలో విజేతలైన విద్యార్థినులకు ధ్రువీకరణ పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

పశ్చిమ ప్రకాశం

అభివృద్ధికి పాటుపడండి

- గిద్దలూరులో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి
- రైతుల ఆదాయం పెంచేందుకు చర్యలు
- కనిగిరిలో కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయాలి
- వర్క్‌షాప్‌లో పశ్చిమ ప్రకాశం ఎమ్మెల్యేల డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పశ్చిమ ప్రకాశం అభివృద్ధికి పాటుపడాలని కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఒంగోలు మీకోసం సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన వర్క్ షాప్‌లో పశ్చిమ ప్రకాశం ఎమ్మెల్యేలు వారి సమస్యలు, వాణిని వినిపించారు. గిద్దలూరు పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, ఆర్మీ ల్యాబ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. కనిగిరిలో రైతులు పండించిన పంటలు నిల్వ చేసేందుకు కోల్డ్‌స్టోరేజ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. రైతుల ఆదాయం పెంచేందుకు వాణిజ్య పంటలను ప్రోత్సహించాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కోరారు.

జిల్లాలో అన్ని రంగాల అభివృద్ధి

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యు మెంట్‌లో అన్ని రంగాలు అభివృద్ధి చెం దితే ప్రకాశం జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలతో తనను కేంద్ర హౌసింగ్, అర్బన్ డెవలప్‌మెంట్ పార్లమెంట్ కమిటీకి ఛైర్మన్ గా నియమించడం పట్ల సిఎం ధన్యవాదాలు తెలిపారు. ఈ కమిటీ లో అమత్, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు ఉంటాయని, రానున్న రోజుల్లో ప్రకాశం జిల్లా అభివద్ధికి కషి చేస్తానని తెలియజేశారు. వెనుకబడిన పశ్చిమ ప్రకాశం ప్రాంత అభివద్ధిని దష్టిలో వుంచుకొని జిల్లా విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాలన్నారు. దొనకొండలో ఆర్మీ ల్యాబ్ ఏర్పాటు అవుతుందన్నారు. . సమావేశంలో జెసి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు

కనిగిరిలో నిమ్జ్ ఏర్పాటు కాకపోతే ప్రత్యామ్నాయ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు కోరారు. నిరుద్యోగ యువతకు శిక్షణ కార్యక్రమాలతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. స్కిల్ సెన్సెస్ పూర్తయితే నిరుద్యోగ యువతకు మరిన్న అవకాశాలు లభిస్తాయన్నారు.

కనిగిరిలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయండి

- ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

నియోజకవర్గంలో రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు కనిగిరిలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కోరారు. గతంలో కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉంచిన పొగాకు మంచి ధరలు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రైతుల సంక్షేమం దృష్ట్యా కనిగిరిలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలన్నారు

గిద్దలూరులో పరిశ్రమలు ఏర్పాటు చేయండి

- ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

పశ్చిమ ప్రకాశంలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన గిద్దలూరులో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కోరారు. నియోజకవర్గంలో అటవీ ఉత్పత్తులైన వెదురు ఎక్కువగా లభిస్తుందని పేపర్ మిల్లు ఏర్పాటు చేయాలన్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో సైన్యంలో పనిచేస్తున్న వారు రాష్ట్రంలోనే ఎక్కువ మంది ఉన్నారని, ఆర్మీ ల్యాబ్ ఇక్కడ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా విజన్ డాక్యుమెంట్‌లో గిద్దలూరు నియోజకవర్గంలో ఏలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నట్లు చూపించకపోవటంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. వెనుకబడిన ప్రాంతాన్ని దృష్టిలో ఉంచుకొని ఉపాధి కల్పించే పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు.

రైతుల ఆదాయం పెంచేందుకు చర్యలు

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

పశ్చిమ ప్రకాశం రైతుల ఆదాయం పెంచేందుకు వాణిజ్య పంటలు, కొత్త పంటలను ప్రోత్సహించాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కోరారు. రైతులు పండించిన పంటలు నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజ్ మార్కాపురంలో ఏర్పాటు చేయాలన్నారు. గుంటూరులో జిల్లా రైతులు కోల్డ్ స్టోరేజ్‌లో పంటలు పెడితే యజమాని వాటిని అమ్ముకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ- ప్రైవేట్ భాగస్వామ్యంలో కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి కేంద్రం రాయితీలు ఇస్తుందని, స్థానికంగా ఉన్న వారిని ప్రోత్సహిస్తే కోల్డ్ స్టోరేజ్‌లు నిర్మించుకోవచ్చన్నారు.